# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం 'కౌముది' పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృథాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.* - మల్లాది

"I write as straight as I can, just as I walk as straight as I can, because that is the best way to get there."

**H.G. Wells**

**ఉదయం డైలీని దాసరి నారాయణరావు స్థాపించాక కిషోర్** (మయూరి వారపత్రిక) నన్ను దాసరిగారు కలవాలని అనుకుంటున్నారని చెప్పి మా మధ్య ఓ రోజు భాగ్యనగర్ ఫిల్మ్ స్టూడియో ఎదురుగా ఉన్న ఆయన గెస్ట్ హౌస్‌లో మీటింగ్ ఏర్పాటు చేసారు. మేడమీద గదిలో ఆయన్ని కలిసాను. ఉదయం దినపత్రిక రచయితలకి పారితోషికం ఇవ్వడం లేదని అప్పటికే నాకు తెలుసు. అంతేకాక దాసరి నారాయణరావు ప్లేగియారిజం చేస్తారని కూడా విన్నాను. అందుచేత ప్రచురించబడని కథని ఆయనకి చెప్పడం ఇష్టం లేక సీరియల్ సినాప్సిస్ చెయ్యలేదు. నా పారితోషికం ఏభైవేలని, అడ్వాన్స్‌గా సగం మొత్తం అడిగాను. ఇవ్వలేదు. ఇస్తారని కూడా నేను ఎదురుచూడలేదు. మళ్ళీ మేం కలవలేదు. నేను సినాప్సిస్ చెప్పనందుకు బయటకి వచ్చాక కిషోర్ అసంతృప్తిని వ్యక్తం చేసారు.

శ్రీ పతంజలి తిరుపతిలో ఉదయం రెసిడెంట్ ఎడిటర్‌గా పని చేసినప్పుడు ఆ ఎడిషన్‌కి మంచి పేరు వచ్చింది. ఆ సమయంలోనే చలసాని ప్రసాదరావు చతుర మాసపత్రికలో, పతంజలి పోలీస్ కానిస్టేబుల్స్ దారుణ ఉద్యోగ జీవితం మీద రాసిన "ఖాకీవనం" అనే ఓ నవలని ప్రచురించారు. ఓ ఐపియస్ ఆఫీసర్ పతంజలి మీద చర్య తీసుకోవాలని కూడా యోచించారు. అది ఎంత దాకా వెళ్ళిందో నాకు గుర్తులేదు. వాసుదేవరావు, నామిని సుబ్రమణ్యం నాయుడు లాంటి హేమాహేమీలైన ఎడిటోరియల్ సిబ్బంది "ఉదయం"లో ఉండేవారు. కాని నా రచనలని ప్రచురించడానికి విముఖంగా ఉండటంతో పతంజలి, నామినిలతో నాకు పరిచయం కలగలేదు. బహుశ నేను కమర్షియల్ రచయితని అవడం ఆ విముఖతకి కారణం అయి ఉండచ్చు. కమ్యూనిస్ట్ భావజాలం ఉన్న కొందరు నా రచనలని పక్కన పెట్టడం ఇప్పటికీ కొనసాగుతోంది.

సందర్భం వచ్చింది కాబట్టి చెపుతాను. తెలుగు డైలీ జర్నలిజం ఎడిటోరియల్ సిబ్బందిగా లెఫ్టిస్ట్ భావాలు గలవారు అధికంగా వచ్చారు. కానీ ఒక్క "ఈనాడు" యాజమాన్యం మాత్రం వీరిని ఎన్నడూ దగ్గరకి రానివ్వలేదు. వచ్చినా వీరి భావాలతో పత్రికని నడిపే స్వతంత్రం వారికి ఇవ్వక వారి మీద అదుపుని కలిగి ఉన్నారు. అలాంటి వారు చేరిన మిగిలిన పత్రికల యాజమాన్యానికి పత్రికా నిర్వహణలో సరైన అవగాహన లేకపోవడంతో వారి పనితనం మీద అదుపు లేదు. వీరిలో ఎక్కువ శాతం మంది దినపత్రికలకి అనుబంధంగా వచ్చే ఆదివారం స్పెషల్స్‌లో స్టాఫ్‌గా ఉన్నారు. వీరు కమ్యూనిస్ట్ భావజాలంతో రాసే రచయితలకి పెద్ద పీట వేయడం, అలాంటి కవితలని, కథలని ప్రచురించడం, అలాంటి పుస్తకాలని సమీక్షించడం, కమర్షియల్ రచయితల పుస్తకాల సమీక్షలని పక్కన పెట్టడం, స్త్రీవాదం, దళిత వాదాలకి చెందిన రచనలని ప్రోత్సహించడం లాంటివి నేటికీ చేస్తున్నారు. అవకాశం వస్తే అమెరికాని తిట్టడం కూడా వారి కార్యక్రమంలో ఓ భాగం. వారు నమ్మిన సిద్ధాంతం పరిధిలో వారు ఇలా ప్రవర్తించడం తప్పని నేను అనడంలేదు. కానీ పాఠకులంతా కమ్యూనిస్ట్ లేదా స్త్రీవాదం, దళిత వాదాలకి చెందిన సిద్ధాంతాలని, బహుశ మాండలీకం దళితులు మాట్లాడుతారు అనుకుని కొత్తగా మాండలీకాలలో చేసే రచనలని చదవాలని అనుకోరు కదా. తమ సిద్ధాంతాలకే కాక, తాము ఏ పాఠకుల నుంచి జీతం తీసుకుంటున్నారో (పాఠకులు పత్రికలు కొనకపోతే వీరికి జీతాలు రావు) వారికి జవాబుదారీగా వీరు పనిచేయడం లేదని నేను బాధపడుతూంటాను. ఉన్నవారంతా అలాంటి వారు అని నేను అనడంలేదు. శ్రీయుతులు చలసాని ప్రసాదరావు, పురాణం సుబ్రమణ్య శర్మ, గజ్జెల మల్లారెడ్డి లాంటి వారు తాము నమ్మిన కమ్యూనిస్ట్ సిద్ధాంతాలని పత్రికా జర్నలిజంలోకి తీసుకురాకుండా పాఠకులకి ఏం కావాలో అది ఇవ్వాలి అనే ఆదర్శానికి కట్టుబడ్డారు.







ఉదయం డైలీ సీరియల్స్ విభాగానికి హైదరాబాద్‌లో ఇన్‌ఛార్జ్‌గా ఉన్న గౌస్ ఉరఫ్ శాతవాహన సీరియల్‌తోనే ఉదయం ప్రారంభం అయింది. అది బాగా హిట్ అయింది. గౌస్ కావాలని కమర్షియల్ రచయితలని సృష్టించవచ్చన్న నమ్మకంతో ఉదయంలో అతను బహుశ

ఎక్స్‌పరిమెంట్ చేయాలనుకుని ఉంటారు. సూర్యదేవర రామ్మోహన్ రావు రాసిన సీరియల్ మోడల్, చల్లా సుబ్రమణ్యం కేబరే డేన్సర్ సీరియల్స్‌కి మంచి ప్రకటనలని ఇచ్చారు. ఆ ప్రమోషన్ టెక్నికల్ వల్ల, తీసుకున్న సబ్జెక్టులు కూడా పాఠకులకి ఆసక్తిని కలిగించేవి. కాబట్టి వారిద్దరికీ కమర్షియల్ రైటర్స్‌గా మంచి గుర్తింపు వచ్చింది. సూర్యదేవర, చల్లాల మధ్య సీరియల్ రచయితలుగా పోటీ, స్పర్ధ కూడా ఏర్పడ్డాయి. నా దగ్గర ఒకరి మీద మరొకరు చెప్పేవారు. చల్లా అప్పట్లో హైకోర్టులో, సూర్యదేవర విజయ డైరీ ఫాంలో పని చేసేవారు. తర్వాత ఇద్దరూ తమ ఉద్యోగాలని వివిధ వ్యక్తిగత కారణాల వల్ల వదిలేసారు. చల్లా సుబ్రమణ్యం మొదటి నవల 1984లో వచ్చిన ఓ అమ్మాయి కథ. పెళ్ళయిన టీనేజ్ అమ్మాయి ఇతివృత్తం అది. నాకు గుర్తున్న మరొకటి చల్లా ఇంటిపేరు కమ్మవారికీ, బ్రాహ్మణులకీ ఉంటుంది. ఓ వర్గం వారు అతను తమ కులం అనుకుని ప్రమోట్ చేసారని, తర్వాత కాదని తెలిసాక వదిలేసారని విన్నాను.

సూర్యదేవర తన పేరుని పూర్వం వీరేంద్రనాథ్ చేసిన వివిధ పద్ధతుల్లో పాపులరైజ్ చేసుకోవడం వల్ల అతనికి రచయితగా మంచి ప్రాచుర్యం లభించింది. దాంతో సూర్యదేవర తన పాఠకులని స్వంతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాడనే భావన వీరేంద్రనాథ్‌కి కలిగిందని నాకు కొన్ని మాటలు, సంఘటనలవల్ల అనిపించేది. ఓ సారి సూర్యదేవరే నాతో స్వయంగా చెప్పారు.

"మల్లాదిగారూ. నేను రచయితని అవాలనుకున్నప్పుడు మీ పాఠకులని ఆకట్టుకోవాలని మీ నవలలని చదివి అలా రాయాలనుకున్నాను. కాని మీ నవలల్లో ఒకదానికి మరో దానికి పొంతన ఉండేది కాదు. వాటిలా రాయడం కష్టం అని తెలిసాక వీరేంద్రనాథ్ నవలలు చదివాను అలా రాయడం తేలిక అనుకుని అలా రాయడం మొదలెట్టాను. కొన్ని కేరక్టరిస్టిక్స్ ఆయన నవలల్లో ఉన్నట్లుగా మీ నవలల్లో నాకు కనిపించక మిమ్మల్ని వదిలేసాను."

వీరేంద్రనాథ్ తను గోప్యంగా ఎడిట్ చేసిన స్రవంతిలో ఇఫ్ టుమారో కమ్స్‌ని తెలుగులో "నైమిష" పేరుతో రాసిన సూర్యదేవర మీద వేసిన వార్తని పాఠకులు ఈనాటికీ మర్చిపోలేదు.

"ఉదయం" వదిలేసాక నల్లకుంటలో గౌస్ మందుల షాపుని పెట్టుకున్నారని, అలాగే పతంజలి ఆయుర్వేద వైద్యం చేసేవారని విన్నాను. గౌస్ వెళ్ళిపోయాక దాని ఇన్‌ఛార్జ్ ఎడిటర్ చైతన్య ప్రసాద్ అదే సంవత్సరం 'సారీ! రాంగ్ నంబర్' అనే డైలీ సీరియల్‌ని నా చేత రాయించారు.




ఉదయం డైలీలో అల్లాణి శ్రీధర్ కూడా కేంపస్ కేంపస్ అనే సీరియల్ రాసారు. అతను దాసరి దగ్గర అసోసియేట్‌గా ఉండేవారు. డైలీలో అతను నవలలు రాస్తూండటం చూసి దాసరి అతన్ని ఉదయం ఎడిటర్‌గా తీసుకువచ్చారు. "రగులుతున్న భారతం" అనే పొలిటికల్ కాలం అల్లాణి అందులో రాసేవారు. ఉదయం వీక్లీ జన్మదిన ప్రత్యేక సంచికని నవలా రచయితల కథలతో ప్రత్యేకంగా తీసుకువచ్చారు. 1989–91 మధ్య ఉండి తర్వాత "కొమరం భీం" సినిమా దర్శకత్వానికి అవకాశం వస్తే ఉదయం నుంచి అల్లాణి నిష్క్రమించారు. అప్పుడు ఆరంభించిన ఆ సినిమా దాదాపు ఇరవై ఏళ్ళ తర్వాత జూలై 2010లో విడుదలై వందరోజులు ఆడి, నంది అవార్డుని కూడా గెలుచుకుంది. ఇన్నేళ్ళ తర్వాత ఓ సినిమా పూర్తయి విడుదలవడం అరుదు. బహుశ నాగయ్య భక్తరామదాసు తర్వాత ఒక్క దీని విషయంలోనే అలా జరిగింది అనుకుంటాను. 1989లో పురాణం గారు ఉదయం ఎడిటర్ గా ఉండగా 'దొంగాట' సీరియల్‌ని రాసాను. పురాణంగారి తర్వాత తోటకూర రఘు వీక్లీ ఎడిటర్ అయినప్పుడు నన్నేం రాయమని అడగలేదు. ఆ తర్వాత శ్రీ పాలకోడేటి సత్యనారాయణరావు ఎడిటర్ అయ్యారు. ఉదయం వీక్లీ చివరి ఎడిటర్ చైతన్య ప్రసాద్.

## శ్రీ పాలకోడేటి సత్యనారాయణరావు

ఉదయం డైలీ వచ్చిన కొద్దికాలానికి వీక్లీని ఆరంభించారు. దాని మొదటి ఎడిటర్ పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు. తర్వాత తోటకూర రఘు. ఆ తర్వాత అల్లాణి శ్రీధర్. తర్వాత పాలకోడేటి సత్యనారాయణరావు. చివరగా చైతన్య ప్రసాద్.




ఉదయం సంస్థలో రామ్మూర్తి అనే తమిళియన్ సి.ఈ.ఓగా ఉండేవారు. ఈయన మద్రాస్‌లో సుబ్బరామిరెడ్డిగారి లిక్కర్ బిజినెస్ యునైటెడ్ బ్రూవరీస్ అనే కంపెనీని చూసేవారు. సుబ్బరామిరెడ్డి ఉదయంని కొన్నాక రామ్మూర్తి గారిని హైదరాబాద్‌కి పిలిపించారు. ఆయన ఇక్కడ వ్యవహారాలన్నీ చక్కబెట్టి కొద్దికాలానికి తిరిగి వెళ్ళిపోయాక ఆ పోస్ట్‌లో చేరిన శ్రీ సి.వి. సుబ్బారావుకి రచయిత శ్రీ పాలకోడేటి సత్యనారాయణరావు బంధువు. పురాణంగారి తర్వాత, చైతన్య ప్రసాద్ ఉదయం వీక్లీకి ఎడిటర్‌గా కొంతకాలం పనిచేసాక డెస్క్‌కి ఆయన్ని మార్చి శ్రీ పాలకోడేటి సత్యనారాయణరావుని ఉదయం ఎడిటర్‌గా తెచ్చారు శ్రీ సి.వి సుబ్బారావు. పాలకోడేటి, నేను ఏ.జి.ఆఫీస్‌లో కలిసి పని చేసాం కాబట్టి మాకు పూర్వ పరిచయం ఉంది. మేం ఇద్దరం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫీస్ వారి రెండు విభాగాల్లో ఒకే కేంపస్‌లో పనిచేసేవాళ్ళం. 1972లో పాలకోడేటి ఏజి ఆఫీస్‌లో, నేను మెంబర్ ఆడిట్ బోర్డ్ ఆఫీస్‌లో ఆడిటర్‌గా పనిచేసేవాళ్ళం. మాకు అక్కడి సాంస్కృతిక సంస్థ రంజని ద్వారా పరిచయం.

1991లో నన్ను సీరియల్ రాయమంటే, 'స్పీడ్ సీరియల్' అనే ప్రక్రియతో, నవలలో కథకి ప్రాధాన్యం ఇచ్చి ఇతివృత్తానికి అవసరం లేని వర్ణనలు, ఇతర చాటభారతాన్ని పక్కన పెట్టి కథ వేగంగా సాగే ప్రక్రియతో ఓ సీరియల్‌ని రాసాను. దానికి ముందు నేను అనుకున్న పేరు గర్భాదానం. అది వద్దని పాలకోడేటి తిరస్కరిస్తే 'కుమార సంభవం' అనే పేరు పెట్టాను. 1990 సెప్టెంబర్ నుంచి, ఆగస్ట్ 1991 దాకా అనుకుంటా పాలకోడేటి ఉదయం వీక్లీ ఎడిటర్‌గా కొనసాగారు.

పాలకోడేటి సత్యనారాయణరావు ఏజీ ఆఫీస్‌లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి, ఎడిటర్‌గా పనిచేయాలన్న పేషన్‌తో ఉదయం వీక్లీకి ఎడిటర్‌గా వచ్చారు. కానీ ఉదయం మూసేసే పరిస్థితికి వచ్చిందని సి.వి.సుబ్బారావు ద్వారా తెలుసుకున్నాక ఆ రాజీనామాని వెనక్కి తీసుకుని తిరిగి ఏ.జి.ఆఫీస్‌లో చేరారు. తర్వాత రిటైర్‌మెంట్ వయసు దాకా అందులో కొనసాగారు. పాలకోడేటి ఈనాడుకి పుంఖానుపుంఖాలుగా భూభ్రమణం అనే శీర్షికకి వందల కొద్దీ వ్యాసాలు రాసారు కాబట్టి ఆ అనుభవంతో ఉదయం పత్రికకి తనే అనేక కలం పేర్లతో రాసేవారు. నేను స్రవంతిని ఎడిట్ చేసినప్పుడు ఎడిటోరియల్ తప్ప మరేం రాయలేదు. రాసే అభిరుచి గలవారు ఎడిటర్ అయితే తామే రాసుకోవడం అనేక మంది విషయంలో గమనించాను. ఇటీవల ఓ సందర్భంలో నవ్య వీక్లీ ఎడిటర్ శ్రీ జగన్నాథ శర్మ 'నేను రాసుకోలేకనాండి ఇతరులని అడగడం? మొత్తం వీక్లీని నింపేయగలను.' అని నాతో అన్నారు.




ఆ తర్వాత శ్రీ పాలకోడేటి బెంగుళూర్ నుంచి వచ్చిన దిక్సూచి అనే ఓ తెలుగు సైంటిఫిక్ మాస పత్రికకి ఎడిటర్‌గా పనిచేసి నన్ను సైంటిఫిక్ మెటీరియల్ రాయమని కోరారు. నేను రాయలేనివి సైంటిఫిక్, హారర్లు. మొదటి సంచికకి ఓ కథ రాసిచ్చాను. ఆ పత్రిక ఏడు సంచికలు వచ్చి ఆగిపోయింది.

**చైతన్య ప్రసాద్**

ఉదయం సంస్థలో నాకు పరిచయం అయిన ఎడిటర్స్‌లో ఒకరు ఉదయం వీక్లీ ఎడిటర్ శ్రీ చైతన్య ప్రసాద్. తూర్పు గోదావరి జిల్లా వేళంగి వాస్తవ్యుడు. శ్రీ త్రిపురనేని శ్రీనివాస్‌లా చైతన్య ప్రసాద్ కమ్యూనిస్ట్ భావాలు గల మనిషి, అంతేకాక అతనిలా చక్కటి సమన్వయం గల నిక్కచ్చి మనిషి. తన కమ్యూనిస్ట్ భావాలు తనపనిలోకి చొరబడకుండా ప్రసాద్, ఉదయం వీక్లీకి ఎడిటర్‌గా తగిన న్యాయం చేసారు. స్వతహాగా భావుకుడైన ఆయన ఆ రకం కవిత్వం రాసేవారు. ఓసారి మల్లారెడ్డిగారు, చైతన్య ప్రసాద్ విశాలాంధ్ర దినపత్రికలో రాసిన కవిత్వాన్ని చదివి చైతన్య ప్రసాద్ మాటల్లోనే 'తిట్టడానికి' పిలిపించారు. వారి మధ్య కొంత చర్చ జరిగింది. ఆ చర్చ అనంతరం ప్రసాద్‌కి ఆయన ఉద్యోగం ఆఫర్ చేసారు! అప్పటికే చైతన్య ప్రసాద్ మల్లారెడ్డిని కవిగా అభిమానిస్తున్నారు. అలా ఉదయం సండే సెంట్రల్ డెస్క్‌లో ప్రసాద్ చేరారు. పత్రికా రంగంలో నాకు చక్కటి స్నేహం కుదిరిన మరో వ్యక్తి చైతన్య ప్రసాద్.

1989లో దాసరి నారాయణరావు ఉదయం సంస్థని శ్రీ మాగుంట సుబ్బిరామిరెడ్డికి అమ్మేసారు. ఆ తర్వాత ఓసారి మాగుంట దగ్గరకి నన్ను మల్లారెడ్డిగారు తీసుకెళ్ళారు. ఆయన ఆకారాన్ని చూస్తే మయూరి భీంరెడ్డిగారు గుర్తుకు వచ్చారు. ఐదారు నిమిషాలు మాత్రమే మేం మాట్లాడుకున్నాం. రచయితలు అందరికీ పారితోషికం ఇచ్చే సదాచారం ఉదయంలో లేదని, మినహాయింపు లేకుండా పారితోషికం అందరికీ ఇస్తే మంచి రచనలు వస్తాయని ఆయనకి సలహా చెప్పాను. శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం వచ్చాక రచయితల పారితోషికానికి కొంత బడ్జెట్ కేటాయించ బడటంతో మొదటిసారిగా రెమ్యునరేషన్ అందరకీ అందసాగింది.

పాలకోడేటి సత్యనారాయణరావుగారు ఎడిటర్‌గా విరమించుకున్నాక ఉదయం వీక్లీకి ఎడిటర్ అవసరం ఏర్పడింది. మల్లారెడ్డి చైతన్య ప్రసాద్‌ని ఉదయం వీక్లీకి ఎడిటర్‌గా బదిలీ చేసారు.

1993లో ఓ రోజు నాకు పూర్వ పరిచయం గల, ఉదయంలో ఎడిట్ పేజీ చూసే శ్రీ తల్లావఝ్ఝుల శివాజీ ఫోన్ చేసి, ఉదయం వీక్లీ ఎడిటర్ శ్రీ చైతన్య ప్రసాద్ నా సీరియల్ కావాలంటున్నారని, ఆ విషయం మాట్లాడటానికి ఆయన్ని తీసుకుని వస్తానని చెప్పారు. మర్నాడు వారు ఇద్దరూ కలిసి మా ఇంటికి వచ్చారు. ప్రసాద్ వయసు అప్పుడు ముప్పై ఐదేళ్ళలోపు. తెల్లటి తెలుపు. అందగాడు. సినిమాల్లో హీరో వేషాలకి పనికి వచ్చే అందం అతనిది. ఆయన కళ్ళు తీవ్రంగా ఉండేవి. కానీ మనిషి మాత్రం బాగా సాత్వికుడు. శ్రీ ప్రసాద్ ఉదయం వీక్లీకి సీరియల్ కావాలని అడిగారు. నా పారితోషికం చెపితే తమ సీఈవో వీరనారాయణరెడ్డి గారు దాన్ని అప్రూవ్ చేయాలని, చేసాక ఫోన్ చేస్తానని చెప్పారు. మర్నాడు మళ్ళీ ఫోన్ చేసి ఆయన నా పారితోషికాన్ని అప్రూవ్ చేసారని, ఓ సారి ఆఫీస్‌కి రమ్మని కోరారు.

నేనుండే గాంధీనగర్‌కి సరిగ్గా ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలో, ఉదయం కాంపౌండ్‌లో అనేక రేకుల షెడ్‌లలో ఉదయం ఆఫీస్‌లు ఉండేవి. ఓ షెడ్‌లోని ప్రసాద్ కేబిన్‌కి వెళ్ళి కలిస్తే సిఈఓ వీరనారాయణరెడ్డి నా నవల సినాప్సిస్ వినాలని అనుకుంటున్నారని చెప్పారు. ఆయన రిటైర్డ్ ఐ.పి.ఎస్ ఆఫీసర్. చిత్రకళలో, సాహిత్యంలో ఆయనకి అభిలాష ఉన్నా ఆయన మాటలని బట్టి ఆనాటి కమర్షియల్ తెలుగు సాహిత్యం మీద పెద్దగా అవగాహన లేదని, ఆంగ్ల సాహిత్యంతో బాగా పరిచయం ఉందని తెలిసింది. ఆయనకి బుద్ధిజం మీద మంచి అవగాహన ఉందని శ్రీప్రసాద్ చెప్పారు. ఎడిటర్ కాని ఇలాంటి పోస్ట్‌లో ఉండే ఈ రకం వారిలోని ఇలాంటి అహాన్ని నేను రెండు, మూడు సందర్భాల్లో ఫేస్ చేసాను. నేను సినాప్సిస్ చెప్పకుండా టి వి ల వల్ల నేటి తరం పిల్లలు ఎలా చెడిపోతున్నారో, దాన్ని ఎలా ఆపాలో అన్న విషయం మీద మాట్లాడి, అదే నా నవల సినాప్సిస్ అని, చైల్డ్ సెంటిమెంట్ కథ అని చెప్పాను. ఆయన ఇగో సేటిస్‌ఫై అయి, 'బావుంది' అని అప్రూవ్ చేసారు. అప్పటికే ఉదయం వీక్లీకి 'దొంగాట' అనే సీరియల్‌ని రాసిన నేను అలా 'మా బాబు' అనే సీరియల్‌ని ఉదయం డైలీ సన్‌డే సప్లిమెంట్‌క్ రాసాను. ఆ తర్వాత నేను ఉదయం వీక్లీకి సీరియల్ రాయకపోయినా చైతన్య ప్రసాద్, నేను, సంపత్‌లు వారానికి ఓసారైనా కలిసేవాళ్ళం.

సంపత్(మాడభూషి సంపత్ కుమార్), చైతన్య ప్రసాద్‌కి అసిస్టెంటుగా ఉండేవారు. సన్నగా, చూడటానికి చాలా అమాయకుడిలా కనిపించే అతను తెలుగులో డాక్టరేట్ చేసిన మేధావి. చిత్తూరు జిల్లా అభ్యుదయ రచయితల సంఘంలో సభ్యుడైన సంపత్, ప్రసాద్‌కి అక్కడే పరిచయం. హైదరాబాద్ లో పార్ట్ టైం లెక్చరర్‌గా పనిచేసే సంపత్ ఉద్యోగం ఊడటంతో చైతన్య ప్రసాద్ అతన్ని అసిస్టెంట్‌గా మల్లారెడ్డిగారికి చెప్పి తీసుకున్నారు.

ఆ రెండేళ్ళు నేను, ప్రసాద్, సంపత్‌లు అనేక సార్లు కలిసి బార్‌కి వెళ్ళేవాళ్ళం. ఎప్పుడూ బిల్‌ని నేనే చెల్లించేవాడిని. కారణం వ్యక్తిగతంగా నాకు వారిద్దరూ స్నేహపాత్రులు అవడం. వారు బిల్ చెల్లిద్దామనుకున్నా అందుకు వారి జీతం సరిపోదు. రాష్ట్రపతి రోడ్ ఆరంభంలో కుడివైపు మేడమీద ఉన్న బార్‌కి, నారాయణగూడా ఎదురుగా ఉన్న వెంకటేశ సినిమా థియేటర్ ఎదురుగా మేడమీద ఉన్న బార్‌కి, చిక్కడపల్లిలోని ఓ బార్‌కి తరచుగా వెళ్ళేవాళ్ళం. నాకు బాగా గుర్తు. ఓ రోజు మేం ముగ్గురం మా మోటర్ సైకిల్ మీద ఆబిడ్స్‌లోని ఓ బార్ నుంచి వెళుతూంటే బేంక్ స్ట్రీట్‌లోని ఓ పోలీస్ స్టేషన్ బయట టూవీలర్ మీద ముగ్గురం ఎక్కాం కాబట్టి ఓ కానిస్టేబుల్ మమ్మల్ని ఆపారు. చైతన్య ప్రసాద్ మేం జర్నలిస్ట్‌లమని తన ఐడెంటిటీ కార్డ్ చూపిస్తే కేస్ బుక్ చేయకుండా మమ్మల్ని వదిలేసారు. పోలీసులు రాజకీయ నాయకుల తర్వాత భయపడేది ఒక్క జర్నలిస్ట్‌లకే. తమ మీద పేపర్లో రాస్తారని జర్నలిస్ట్‌లతో పోలీసులు పెట్టుకోడానికి భయపడతారు. ఈ కారణంగా జర్నలిస్ట్‌లు కాని, పేపర్ ఆఫీస్‌తో సంబంధం గల చాలామంది తమ వాహనాలకి 'ప్రెస్' అనే స్టిక్కర్‌ని అంటించుకుంటూంటారు.

సందర్భం వచ్చింది కాబట్టి చెపుతాను. ఒకతను హైద్రాబాద్‌లో సినిమా ఇండస్ట్రీలో పని చేస్తున్నానని తన బంధుమిత్రులకి చెప్పేవాడు. ఒకరు ఏం పనిచేస్తున్నావని అడిగితే. 'గుర్రాల కళ్ళకి గంతలు తయారు చేసి అమ్మే ఫేక్టరీలో పని చేస్తున్నాను' అని జవాబు చెప్పాడు. 'అదేమిటి? మరి సినిమా ఇండస్ట్రీలో చేస్తున్నావని చెపుతున్నావేమిటి?' అని అడిగితే, 'తమ ఫేక్టరీ చేసే కొన్ని గంతలని సినిమాలకి గుర్రాలని అద్దెకి ఇచ్చే యజమానికి సప్లై చేస్తుందని, కాబట్టి తను సినిమా ఇండస్ట్రీ మనిషేనని' జవాబు చెప్పాడు. ఇలాగే జర్నలిస్టేతర్లు కూడా తమ వాహనాలకి ప్రెస్ స్టిక్కర్‌ని అతికించుకుంటుంటారు. ఇలా ప్రెస్‌లకి ఇంక్‌ని సప్లై చేసే ఒకరు తన బండికి ప్రెస్ అన్న అక్షరాల స్టిక్కర్‌ని అతికించుకోవడం నాకు తెలుసు.

1993-95 మధ్య ఉదయం సంస్థ మూసేసేదాకా చైతన్య ప్రసాద్ ఉదయం వీక్లీ ఎడిటర్‌గా పనిచేసారు. 'ఉదయాన్ని మూయించి బయటకి వచ్చాను' అని సరదాగా నాతో ఓసారి అన్నారు. సంపత్ మద్రాస్ వెళ్ళిపోయారు. క్రమంగా చైతన్య, నేను కలవడం తగ్గిపోయింది.

ఉదయంలో ఉండగా చైతన్య ప్రసాద్ అంబర్ పేటలోని సునీత అపార్ట్ మెంట్స్‌లో అద్దెకి ఉండేవారు. హాసం రాజా కూడా అక్కడే అద్దెకి ఉండేవారు. వీరిద్దరి ఇళ్ళకి ఒకటి రెండు సార్లు వెళ్ళాను. 1998 అనుకుంటా కూకట్‌పల్లి ప్రాంతంలోని భాగ్యనగర్ కాలనీలో చైతన్య ప్రసాద్ ఓ అపార్ట్‌మెంట్ కొనుక్కుని గృహప్రవేశం చేసినప్పుడు మా మధ్యగల స్నేహభావమో మా ఇంటికి వచ్చి ఆహ్వానిస్తే నేను ఆ శుభకార్యానికి వెళ్ళాను. 2001లో మళ్ళీ అటు వెళ్ళినప్పుడు అతనింటికి వెళ్ళాను. ప్రస్తుతం అతను కూకట్ పల్లిలోని జె ఎన్ టి యు గేట్ ఎదురుగాగల ప్రగతి నగర్ కాలనీలో ఉంటున్నారు.

కవి అయిన శ్రీ చైతన్యప్రసాద్‌కి సినిమాల్లో పాటలు రాయాలనే ఉత్సాహం ఉండేది. తర్వాత జర్నలిస్ట్‌గా ఎక్కడా చేరక సినిమాకి పాటలు రాసే ప్రయత్నాలు మొదలుపెట్టారు. శ్రీ ఉప్పలపాటి నారాయణ రావు సినిమాకి పాటలు రాసారు కానీ అది రిలీజ్ కానే లేదు. చాలాకాలం స్ట్రగుల్ అయ్యాక చైతన్య ప్రసాద్ కొన్ని సినిమాలకి మంచి పాటలు రాసారు. 2002లో 'అల్లరి రాముడు' చిత్రంలోని పాటలతో చైతన్య ప్రసాద్‌కి మంచి బ్రేక్ వచ్చింది. 'బ్రోకర్' సినిమాలో అతను రాసిన 'పురుడు పోస్తే లంచం, బొడ్డు కోస్తే లంచం' పాట, 'ఆ నలుగురు' లోని 'ఒక్కరే రావడం, ఒక్కరే పోవడం' లాంటి పాటలు బాగా హిట్ అయ్యాయి. అతని సూపర్ హిట్

పాటల జాబితాలో ‘మర్యాద రామన్న‘ చిత్రంలోని ‘రాయె రాయె రాయె సలోనీ‘ పాట కూడా ఒకటి. సింగిల్ కార్డ్ గీత రచయితగా, అంటే ఒకే సినిమాలోని అన్ని పాటలు రాసే స్థాయికి ఇప్పుడు అతను ఎదిగారు. ఇది రాయడానికి మునుపు అతనికి ఫోన్ చేసి మాట్లాడితే, సినీ గీత రచయితగా ఎదిగినా, సాధారణంగా వచ్చే ఎలాంటి అహం లేకుండా ఆనాటి చైతన్య ప్రసాద్‌లానే ఆప్యాయంగా మాట్లాడారు. ఇది మనుషుల్లో అరుదుగా ఉండే గుణం.

చైతన్య ప్రసాద్ ద్వారా నాకు ఉదయంలో ఇద్దరు ఎడిటర్స్ పరిచయం అయింది. వారిలో ఒకరు శ్రీ గజ్జెల మల్లారెడ్డి.

*(మిగిలిన జ్ఞాపకాలు వచ్చేనెల)*

Click here to share your comments on this story